క్లుప్తంగా

శాకంబరిగా శ్రీ కళాంబదేవి



కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళిశర్మ, ఈఓ శ్రీధర్‌ల పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలోగల నవగ్రహ మండపంలో శనీశ్వరస్వామికి తొలుత తైలాభిషేకం నిర్వహించారు. భక్తులందరితో శనిదోశ నివారణ పూజలు నిర్వహింపజేశారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కామకోటి కళాంబదేవికి శాకంబరిగా అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. వర్షాలు మెండుగా కురవాలని, పాడి పంటలతో రాష్ట్రం వర్ధిల్లాలని ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు.

రేపు అమావాస్య పూజలు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆషాడ బహుళ అమావాస్య సందర్భంగా సోమవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు కల్యా సుధాకర్ తెలిపారు. ఉదయం 4.30 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తామని, అనంతరం భక్తబృందం సహకారంతో అర్చకులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు.

తిరుచ్చి వాహనంపై కడప రాయుడు



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆషాఢ త్రయోదశి సందర్భంగా మాసోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఆ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పంచామృతాభిషేకం చేసి కనుల పండువగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను పల్లకీపై తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ గ్రామోత్సవంలో భక్తులకు హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో శనీశ్వర పూజలు



తైలాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం ఆషాఢ శనిత్రయోదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం లోగల నవగ్రహాల్లోని శనీశ్వరస్వామికి ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు భక్తులతో కలిసి తైలాభిషేకం నిర్వహించారు. అన్ని గ్రహాలు అమ్మవారి ఆధీనంలో ఉంటాయన్న భావనతో ఈ సందర్భంగా అమ్మవారికి కూడా విశేష పూజలు, అర్చనలు నిర్వహించి కార్యసిద్ధి జరగాలని కోరుకున్నారు.

ముఖ్యమంత్రికి దూదేకులు కృతజ్ఞతగా ఉంటారు



డిప్యూటీ సీఎం అంజద్‌బాషను సన్మానిస్తున్న సుంకేసుల ఖాదర్‌బాష, అక్బర్ అలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద ముస్లిం వర్గాలతో పాటు దూదేకుల నూర్‌బాష ముస్లింలకు కూడా షాదీ తోఫా పథకం కింద వివాహం చేసుకున్న జంటలకు రూ. లక్ష వర్తించేలా జీఓ జారీ చేయడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని దూదేకుల సంఘం ప్రతినిధి సుంకేసుల ఖాదర్‌బాష, వైఎస్సార్ సీపీమైనార్టీ నాయకులు అక్బర్ అలీలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషను కలిసి ఘనంగా సన్మానించారు. పేద దూదేకులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని వారు తెలియేశారు.

పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ సేవలు



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు



25వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- రూ.5 వేలు ఇస్తామంటే ఇంట్లో పనికి కూడా ఎవరూ రారు
- సేవ చేస్తున్న వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు దారుణం
- 'జగనన్న సురక్ష' లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ సేవలు నయాపైసా ఖర్చు లేకుండా అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక 38, 24, 25వ డివిజన్లలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరాల్లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ పాలనలో పింఛన్, రేషన్ కార్డు ఏది కావాలన్నా జన్మభూమి కమిటీల సంతకాలు పెట్టించుకొని రమ్మనేవారని, వారు ఎంతో కొంత ముట్టచెబితే తప్పా సంతకం పెట్టేవారు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సంతకాలతో అవసరం లేకుండా అర్హులై ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం దారుణమన్నారు. వారు కేవలం సేవాభావంతో రూ.5వేల గౌరవ వేతనంతో పనిచేస్తున్నారని, ఇంట్లో పని చేయడానికి కూడా రూ.5వేలు ఇస్తామంటే ఎవరూ రారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై ఆరోపణలు చేస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని 'జగనన్న సురక్ష' శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు మగ్బూల్‌బాషా, కె. సూర్యనారాయణరావు, ఎస్‌ఏ షంషీర్, 24వ డివిజన్ ఇన్‌చార్జి మేసా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, పత్తిరాజేశ్వరి, శివకేశవ, సమర నాథరెడ్డి, బంగారు నాగయ్య, మియ్యా, షఫీ, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పార్కు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



పార్కు పక్కన ఉన్న మట్టి రాళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రాయచోటి రోడ్డులో బ్రిడ్జి కింద నిర్మిస్తున్న పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పార్కు పనులను పరిశీలించారు. పార్కు ఎంట్రెన్స్‌లో పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని, గ్రీనరీ మరింత పెంచాలన్నారు. ఫౌంటేన్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పార్కులో డ్రైన్ నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసులరెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడొద్దు



మాట్లాడుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మెంబర్ పాకా సురేష్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: అభివృద్ధికి అడ్డుపడేలా తెలుగు దేశం పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. శనివారం కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు కె. రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, మాజీ కార్పొరేటర్లు ఇ. చైతన్య, ఎంఎల్ఎన్ సురేష్‌బాబులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా కడపలో అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకులు మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే జిల్లాలో అభివృద్ధి జరిగిందని, వందల కోట్లు వెచ్చించి ఆయన రిమ్స్ హాస్పిటల్, వైవీయూ, రహదారుల విస్తరణ, బుగ్గవంక సుందరీకరణ వంటి పనులు చేపట్టిన సంగతి గుర్తు చేశారు. వైఎస్ సీఎంగా ఐదేళ్లలోనే కడప రూపురేఖలు మారిపోయాయన్నారు. ఆయన మరణం తర్వాత మళ్లీ అభివృద్ధి పడకేసిందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో 12 జిల్లాలే అన్న విధంగా వ్యవహరించి, వైఎస్సార్ జిల్లాను పూర్తిగా పక్కనబెట్టేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేస్తున్నారని తెలిపారు. బుగ్గవంక ప్రహరీ పూర్తి చేసి, అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నామని, రహదారుల విస్తరణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయన్నారు. సోమశిల బ్యాక్ వాటర్ స్కీంను టీడీపీ ప్రభుత్వం రద్దు చేస్తే, బ్రహ్మంసాగర్ నుంచి కడపకు 1.5 టీఎంసీల నీటిని కేటాయించి, రూ.572 కోట్లతో పైపులైన్ల ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు శంకుస్థాపన చేశారన్నారు. కడపలో రూ.58 కోట్ల పనులు పూర్తి చేసి, బిల్లులు కూడా చెల్లించడం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కడపకు చేసింది శూన్యమన్నారు. ఆలంఖాన్‌పల్లె సభలో రూ.2కోట్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు, ఒక్క రూపాయి విదల్చలేదని, లింగంపల్లి వద్ద సబ్‌సర్ఫేజ్ డ్యామ్‌కు శంకుస్థాపన చేసి వదిలేశారన్నారు. ఈ విషయాలు టీడీపీ నాయకులు గుర్తించాలని తెలిపారు.

పరిశోధన ఫలితాలు భవిష్యత్తుకు మార్గాలు కావాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : పరిశోధన ఫలితాలు సక్రమంగా వినియోగిస్తే పరిశోధకుల భవిష్యత్తుకు మార్గాలు అవుతాయని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శనివారం విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంచాలకులు ఆచార్య పి. చంద్ర ఓబులరెడ్డి ఆధ్వర్యంలో 'పరిశ్రమ–అకాడెమియా లెక్చర్ సిరీస్'లో భాగంగా అనువాదాలు, పరివర్తనలు– పరిశ్రమలకు విద్యావేత్తలు అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్కాలర్లు వారి పరిశోధన ఫలితాలే సమాజ ప్రయోజనాలకు వినియోగించేలా ఆలోచించాలన్నారు. హైదరాబాద్‌లో ఉన్న యుఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మెడిసిన్ సంస్థలో మన విద్యార్థులు ప్రాజెక్టు వర్కు చేసుకునేలా చూస్తామన్నారు. సంస్థ సీడ్ మనీ ఇస్తే ఇక్కడ పరిశోధనలు చేస్తామన్నారు. యుఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మెడిసిన్ వ్యవస్థాపకులు, సీఈఓ డా. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తాను కెనడాలో ఎంఎస్సీ, స్వీడన్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసి నా పరిశోధన ఫలితాలనే మెడిసిన్స్‌గా మార్కెట్‌లోకి తీసుకువచ్చామన్నారు. ప్రతి పరిశోధకుడు తమ పరిశోధనలను కమర్షియల్ వైపు తీసుకువస్తే సమాజానికి, పరిశోధకుడికి ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ అకడమిక్ నుంచి మార్కెట్‌లో నిలబడేలా మెలకువలను వివరించారు. రీసెర్చ్ తర్వాత భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఆచార్య చంద్రమతీశంకర్, ఆచార్య చంద్రశేఖర్, ఆచార్య ఎల్.వి. రెడ్డి, ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి, డా. మాధవరెడ్డి, డా. మునికుమారి, డా. ప్రశాంతి, డా. రియాజున్నీసా, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాల వెల్లువ



పెద్దపుత్తలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాజోలు వీరారెడ్డి

వల్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు మండలంలోని పెద్దపుత్త గ్రామంలో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. బుక్‌లెట్ల ద్వారా ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు శివకుమార్‌రెడ్డి, పోలు ఈశ్వర్‌రెడ్డి, పోలు శేఖర్‌రెడ్డి, పుత్తా లోకేశ్వర్‌రెడ్డి, ఆర్‌వీ రాఘవరెడ్డి, కమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ రాజోలు నిఖిల్‌రెడ్డి, పుత్తా నారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లేబాక మునీంద్రారెడ్డి, సుబ్బిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ శంకర్‌రావు, ఎంపీడీవో జుబేద, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో లిల్లెమ్మ, ఏవో సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఏపీవో పార్థసారథి, ఏఈలు పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కుటుంబ అవగాహన సదస్సు

కడప కల్చరల్ : కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని సొసైటీ కమ్యూనిటీ హాలులో సోమవారం కుటుంబ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కడప నగరానికి చెందిన జీసెస్ క్రైస్ట్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో దైవ జనులు బ్రదర్ పి.సునీల్‌కుమార్ ముఖ్య ప్రసంగీకులుగా హాజరు కానున్నారన్నారు. బ్రదర్ డాక్టర్ పి.లాజరస్, డాక్టర్ జి.నవీన్‌బాబు వాఖ్య సందేశం అందించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బైబిల్ తరగతులు నిర్వహిస్తారు. రాత్రి 7.30 నుంచి 10.00 గంటల వరకు ఆధ్యాత్మిక సభ నిర్వహిస్తారు.

మణిపూర్‌లో మారణకాండను ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలోని మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ఆపాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బషీరున్నీషా పేర్కొన్నారు. శనివారం ఈమేరకు నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్‌లో పేద ప్రజలను అణచివేసేందుకు మారణ కాండ సృష్టిస్తున్నారని తెలిపారు. మణిపూర్ దుర్ఘటనలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్ళు మున్నీ, పద్మ, బీబీ, మగ్బూల్, కమలమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ కడప నియోజక వర్గ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించి ప్రజా ధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బయ్య, చంద్రారెడ్డి, నాగరాజు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో సాంస్కృతిక ప్రదర్శనకు అవకాశం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయ భక్తబృందానికి ఆగస్టు 1న తిరుమలేశుని సన్నిధిలో సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం లభించిందని నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. ఆగస్టు 1వ తేది రాత్రి 7 నుంచి 8 వరకు దాదాపు 100 మందికి పైగాగల తమ భక్తుల బృందానికి కోలాటం నగర సంకీర్తన కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం లభించిందని తెలిపారు. ఇదే సందర్భంగా భక్తులకు సాంస్కృతిక వేదిక వద్ద విష్ణు సహస్ర పారాయణం చేసేందుకు అవకాశం లభించిందన్నారు. నెల రోజులుగా ధార్మికవేత్త చెన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులు కోలాట నృత్యంతోపాటు విష్ణు సహస్ర పారాయణం సాధన చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీచు నరేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు హరినారాయణ తెలిపారు. శనివారం నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహం, జేఎస్‌ఓఎస్ పిల్లల అనాథ శరణాలయం, అమ్మ ఒడి ఆనంద నిలయం, ఆజాద్‌నగర్‌లోని బృంద వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బీచు అక్కయ్య, వీణా వాణి, శివనాగిరెడ్డి, చేతన్‌రెడ్డి, హిమ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

వీరపునాయునిపల్లె : ఎస్.పాలగిరిలో రూ.96 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆదివారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రారంభిస్తారని మండల ఇంజనీర్ మల్లారెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, పాలకేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొంటారని, సర్పంచులు, ఎంపీటీసీలు విజయవంతం చేయాలన్నారు.

సేవకు సలాం



కుటుంబ సభ్యురాలిగా..



వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ నీలం హరిణి

ఈమె పేరు నీలం హరిణి. నగరంలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో వలంటీర్‌గా సేవలు అందిస్తోంది. నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను లబ్ధిదారుల దరికి చేరుస్తోంది. తన పరిధిలోని ఇంటింటికీ తిరుగుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించడం.. తెల్లవారక ముందే ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్‌లు అందజేస్తోంది. కుటుంబ సభ్యురాలిగా వారికి ఏ పని కావాలన్నా చేసి పెడుతోంది. కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలోనూ ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసి వృద్ధుల దీవెనలు పొందింది.

– కడప వైఎస్‌ఆర్ సర్కిల్

మనవరాలిగా సేవ చేస్తోంది..



వలంటీర్ నీలం హరిణి నాకు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తుంది. ఏ అవసరం వచ్చినా నేనున్నాంటూ వచ్చి పనులు చేసి పెడుతోంది. వలంటీర్ వచ్చినప్పటి నుంచి నాకు ఇంటి వద్దకే పెన్షన్ ఇస్తున్నారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి అలసి పోయే వాడిని. ప్రస్తుతం ప్రతి నెలా వేకువజామునే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తోంది. ఆధార్ కార్డు ఫోన్ లింకు , వేలిముద్రలు పడకపోయినా సరి చేస్తున్నారు. నా నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా మనవరాలిగా పని చేస్తోంది.

- చిన్న కాసులు, 45వ డివిజన్, ఊటుకూరు గ్రామం

సొంతింటి కల సాకారానికి కృషి..



వలంటీర్ నుంచి ఇంటి పట్టా అందుకున్న షకీల పర్వీన్(ఫైల్)

వలంటీర్లు సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని 29వ డివిజన్‌లో వలంటీర్ ఆయేషా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తోంది. ఈ డివిజన్‌లో ఉన్న షకీల పర్వీన్ అనే మహిళకు ఇంటి స్థలం మంజూరు విషయంలో దరఖాస్తు నమోదు నుంచి ఇల్లు నిర్మాణ విషయంలో ప్రభుత్వ అధికారుల సమాచారాన్ని ఆమెకు అందజేస్తూ వలంటీర్ అండగా ఉంటోంది. ఈ డివిజన్ పరిధిలోని పేదలకు కూడా ఇంటి పట్టాల మంజూరు కోసం దరఖాస్తు చేయించింది. ప్రస్తుతం పర్వీన్ ఇంటి నిర్మాణానికి సంబంధించి పిల్లర్స్‌ను వేసి పనులను మొదలు పెట్టారు. ఇక దశల వారిగా ఇంటి నిర్మాణ పనులు పూర్తికావాల్సి ఉంది. వలంటీర్లు అందిస్తున్న సేవలను పలువురు కొనియాడుతున్నారు.

– కడప ఎడ్యుకేషన్

వలంటీర్ సహకారంతోనే..



నాకు ఇంటి స్థలం మంజూరు విషయంలో మా వలంటీర్ ఆయేషా ఎంతగానో సహకారం అందించింది. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోంది. గతంలో ఇంటి కోసం చాలా సార్లు దరఖాస్తు చేసినా రాలేదు. వలంటీర్ దగ్గర ఉండి నాతో దరఖాస్తు చేయించి ఇంటి స్థలం మంజూరుకు కృషి చేసింది. ఆమె కృషి తో నా ఏళ్లనాటి ఇంటి కల నెరవేరబోతోంది. చాలా ఆనందంగా ఉంది.

- షకీల పర్వీన్, కడప నగరం

'కలియుగ పట్టణం' పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

కడప ఎడ్యుకేషన్ : నాని మూవీ వర్క్సు అండ్ రామా క్రియేషన్స్ పతాకంపై విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా రమాకాంత్‌రెడ్డి దర్శకత్వంలో కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న కలియుగ పట్టణం సినిమా విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష చేతుల మీదుగా ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు డిప్యూటీ సీఎంతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డి, ఏపీ ఇండస్ట్రీస్ అడ్వైజర్ రాజోలి వీరారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ఆర్ఎల్‌టి గ్రూపు చైర్మన్ అమీర్‌బాబు, టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చిన్నపురెడ్డి, నాగార్జున మోడల్ స్కూల్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మాట్లాడుతూ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండే సినిమాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. పోస్టర్ లాంచ్ చేసిన అనంతరం ఆయన ఆ చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ కందుల రాజేశ్వరమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు



శనీశ్వర పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు

కడప కల్చరల్ : శని త్రయోదశి సందర్భంగా శనివారం కడప నగరంలోని పలు దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర అర్చక పురోహిత ఐక్యవేదిక సహ కార్యదర్శి విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో స్థానిక మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ శంకరమఠంలో ఈ సందర్భంగా శనీశ్వరుని పూజలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహన్యాస రుద్రాభిషేకం, నవగ్రహ మండపారాధన, ప్రధాన కలశ స్థాపన, సంపూర్ణ శనిజపం, లక్ష్మిగణపతి, లక్ష్మినారాయణ, రుద్ర మృత్యుంజయ, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప నగరంతోపాటు ప్రొద్దుటూరుకు చెందిన పలువురు వేద పండితులు హాజరై శనీశ్వరస్వామి జపాన్ని సామూహికంగా నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి చేసి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు.

హాజరైన ప్రముఖులు

శనీశ్వరస్వామి పూజల్లో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు పాల్గొన్నారు. నిర్వాహకులు విజయ్‌భట్టర్ వారికి సంప్రదాయ స్వాగతం పలికి వారిచే పూజలు చేయించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వారు మహాపూర్ణాహుతి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఎస్ఎస్ సొల్యూషన్స్ హెడ్ ఎస్.యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, లాజిస్టిక్స్, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, టీవీ రిపేర్, టీచింగ్ కోర్సులకు టెన్త్, ఇంటర్ పాస్/ఫెయిల్ అభ్యర్థులు అర్హులన్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99089 74770, 8106059836 నెంబరులో సంప్రదించాలన్నారు.